ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025
I
అల్లూరి సీతారామరాజు



బాధిత చిన్నారుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మత్స్యపురం పంచాయతీలో కుంటలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ కృష్ణకుమారి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మూడు నెలల క్రితం తప్పిన చెరువులో జారి మునిగి ప్రాణాలు కోల్పోయారన్నారు.. తల్లి దండ్రులు పిల్లల సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్వైజర్ సూచించారు.



కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణకుమారి

మన్యాన్ని ముంచెత్తుతున్న వానలు

›› పొంగి ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు ›› పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



పాడేరులో నీట మునిగిన వరి పొలం



హుకుంపేట మండలం చీడిపుట్టు వంతెనపై ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, వాగులు, వంకలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లోకి వర్షం నీరు వచ్చి చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో శనివారం నుంచి ఒక మోస్తరుగా కురిసిన వాన, ఆదివారం రోజంతా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో పాడేరులో ఆదివారం 134.25 వర్షపాతం నమోదు కాగా సోమవారం 161.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాడేరులో సోమవారం కూడా వర్షం వీడలేదు. శనివారం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కొనసాగింది. పాడేరు మొదలుకొని జిల్లాలోని అన్ని మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారాయి.

పాడేరు మండలంలోని మత్స్యగెడ్డ, రాయిగెడ్డ, చిలకలమామిడి గెడ్డ, పాడేరు, పెదబయలు మండలాలకు సరిహద్దుగా ఉన్న వరదాపుట్టు గెడ్డ, జి.మాడుగుల మండలంలోని కోడిమామిడి గెడ్డ, మత్స్యగెడ్డ, ముంచంగిపుట్టు మండలంలో బూసిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు ప్రాంతా ల్లోని గెడ్డలు, డుంబ్రిగుడలోని చాపరాయిగెడ్డ, సంపంగి గెడ్డ, లోచలి గెడ్డ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గెడ్డలకు ఆనుకుని ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గిరిజనులు గ్రామాలకే పరిమితమయ్యారు. హుకుంపేట-చిడిపుట్టు మధ్యలో ఉన్న వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తున్నది. దీంతో అడ్డుమండ, బారపల్లి, గడ్డికించుమండ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పాడేరులో అధిక వర్షపాతం నమోదు

జిల్లాలో సోమవారం పాడేరులో 161.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏటపాక 8.4, కూనవరం 8.8, చింతూరు 33.4, విఆర్ పురం 19.2, ముంచింగిపుట్టు 74.2, పెదబయలు 50.0, డుంబ్రిగూడ 32.6, అరకువేలీ 35.2, అనంతగిరి 102.6, హుకుంపేట 112.6, పాడేరు 161.4, జి.మాడుగుల 94.2, చింతపల్లి 50.4, జీకే వీధి 72.4, కొయ్యూరు 30.2, మారేడుమిల్లి 42.8, దేవీపట్నం 26.8, వై రామవరం 39.6, అడ్డతీగల 42.2, రాజవొమ్మంగి 38.6, గంగవరం 38.8, రంపచోడవరం 23.2 జిల్లాలో మొత్తం 1137.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెదబయలు : మండలంలో వర్షం కురిసింది. సోమవారం వారపు సంత కావడంతో వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. సంత బురదమయంగా మారింది. తుపాను కారణంగా ప్రజలు అప్రమతంగా ఉండాలని స్థానిక ఎస్ఐ కె.రమణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాగులు, కాజ్వేలపై నీరు పొంగి ప్రహిస్తున్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు.భారీ వర్షాల కురుస్తున్నందున వాహనాల సర్వీసులు నిలిపి వేయాలన్నారు.

జి.మాడుగుల: వర్షాలకు మండల కేంద్రంలోతో పాటు పలు గ్రామాలలో వరద నీరు ముంచెత్తింది. గడ్డిరాయి కుమ్మిడిసింగి గ్రామాల మధ్య కాజ్వేల పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొత్తపల్లి వాటర్ ఫాల్స్ ను మూసివేశారు.పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రాజ్ కుమార్, ఎస్సై షణ్ముఖరావు ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హుకుంపేట : మండలంలోని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చీడిపుట్టు వంతెనపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.ఈ పరిస్థితిని గమనించిన రెవెన్యూ శాఖ అధికారులు వంతెన రెండు వైపుల కర్రలు రాళ్ళు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. గ్రామస్తులు, ప్రయాణికులు వంతెన దాటేందుకు ప్రయత్నించవద్దని అధికారులు సూచించారు.


డుంబ్రిగుడ: మండలంలో సోమవారం తెల్లవారి నుంచి భారీ కుండపోత వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవడంతో మండల కేంద్రంలోని నివాస గృహాల్లో లోపల వర్షపునీరు చేరడంతో స్థానిక గిరిజనులు పలు ఇబ్బందులు పడ్డారు. పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం గడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుంది. కితలంగి రోడ్డు కాజ్వే పైన వరద నీరు ప్రవహించడంతో ఆ ప్రాంతా గ్రామాల గిరిజనులకు రవాణా స్తంభించుకు పోయింది. డోమంగి, రంగిలిసింగి, లైగండ పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి.

మెకానిక్ షెడ్పై కూలిన భారీ టేక్ చెట్టు.

చింతపల్లి: మండల కేంద్రంలోని మెకానిక్ షెడ్పై భారీ టేక్ చెట్టు కూలి పోయింది. నివాస గృహాల మధ్య ఏపుగా పెరిగిన పురాతకాలం నాటి ఈ టేక్ చెట్టు క్రమంగా దుకాణాలపై ఒరిగి ఉండగా, వర్షాలు కారణంగా ఒక్కసారిగా కూలిపోయింది. ప్రమాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించారని గ్రామస్తులు వాపోతున్నారు.

నీట మునిగిన వరి పంట పొలాలు

అనంతగిరి: మండలంలోని తుఫాను ప్రభావ కారణంగా రెండు రోజులు గా ఎడతెరిపి లేకుండా కుండపోతవానతో గెడ్డలు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వరి పంట పొలాలు నీట మునిగి చెరువు లను తలపించాయి. పినకొట పెద్దకోట పంచాయతీ పరిధిలో ఉన్న పంట పొలాలు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపించాయి. 20 మంది రైతులకు చెందిన 50 ఎకరాల పైగా వరి పంట పొలాలు దెబ్బతిన్నాయి.



జి.మాడుగుల మండలం కుంబుసింగి గెడ్డలో ప్రవహిస్తున్న నీరు



చింతపల్లిలో కూలిన చెట్టు

ఉపాధ్యాయుల నియామకం

-ఎంఇఓ బాలాజీ వెల్లడి
-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -అనంతగిరి: గోడు వినే నాధుడేడీ భర్తీ కానీ ఉపాధ్యాయ పోస్టులు పేరుతో ఈనెల 17వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్. దినేష్ కుమార్ ఆదేశాలతో. మండలంలోని 27 ప్రాథమిక పాఠశాలలకు డిప్యూటేషన్ కింద టీచర్లను నియమించామని మండల విద్యాశాఖ అధికారి. బాలాజీ పేర్కొన్నారు. ప్రజాశక్తి విలేకరితో సోమవారం ఆయన మాట్లాడుతూ. ఇద్దరూ టీచర్స్ ఉన్న పాఠశాల నుండి ఒక టీచర్ కు డిప్యూటేషన్ కింద పంపడం జరిగిందని తెలిపారు. మర్దగూడ పాఠశాల నుండి లక్ష్మీపురం పాఠశాలకు మహిళా టీచర్ ను నియమించామన్నారు. కాంగుపూటు పాఠశాల నుండి కాకరపాడు పాఠశాలకు, డొంకపోటు పాఠశాల నుండి దిగువసొనబ పాఠశాలకు, అనంతగిరి గర్ల్స్ 1 బాలికల పాఠశాల నుండి బీసుపురం పాఠశాలకు, అలాగే బొర్రా బాలుర పాఠశాల నుండి సారగూడ పాఠశాలకు, చీడీవలస పాఠశాల నుండి సొట్టడవలసకు, గరుగుబిల్లి పాఠశాల నుండి. పెదరాబా కు, కిత్తయ్యతోట పాఠశాల నుండి. జిలుగులపాడు పాఠశాలకు, బీటుగరువు పాఠశాల నుండి. బిల్లకోట పాఠశాలకు, సింగవరం నుండి. చిప్పపల్లికు, అలాగే ఇతర పాఠశాలల నుంచి డెప్యూటేషన్పై పంపామన్నారు.





దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న గంగరాజు

వర్ష నష్టాలపై జెడ్పిటిసి గంగరాజు ఆరా

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని గత వారం రోజులు తుఫాను ప్రభావ కారణంగా వ్యవసాయ పంటలు, ఇల్లులు ఆస్తి వంటి నష్టాలపై తెలుసుకునేందుకు స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు సోమవారం ఎగువశోభ పంచాయతీ పరిధి దిగువశోభ. పొర్నా పొదర్, ఎగువ శోభ, సరస్సు పొదర్, బీసుపురం. కమలపురం, జామగుడ. తదితర గ్రామాలలో సందర్శించారు. అనంతరం తుపాన్ నష్టం పై గిరిజనులతో అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పంటలు, ఇల్లులు దెబ్బతినట్లయితే వెంటనే రెవిన్యూ అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసుపురం మెయిన్ రోడ్డు నుండి ఎగువ శోభ మీదుగా దిగువ శోభ, బొర్రా మెయిన్ రోడ్డు వరకు 2021- 22 సంవత్సరంలో హెూం శాఖ నిధులు రూ 12 కోట్లు రూపాయలతో సుమారు 8 కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులు నాసిరకంగా చేపట్టడంతోనే వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు.అధికారులు పర్యవేక్షణ లోపంతోనే కాంటాక్టర్ ఇష్టా రాజ్యంగా పనులు చేపట్టడంతోనే నిర్మించిన మూడేళ్లు కాకుండానే శిథిలావస్థకు చేరిందన్నారు.ప్రజలు తుఫాన్ ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలన్నారు.. ఈ కార్యక్రమంలో సొంటరి సుబ్బారావు పాంగి.మద్దు, రమేష్, పి.జయ్ పాల్గొన్నారు,

హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- చింతపల్లి: బీసీ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సోమవారం చింతపల్లి మండలంలోని ఐటిడిఏ క్వార్టర్స్ లో గత కొన్ని సంవత్సరాలుగా బిసి వెల్ఫేర్ హాస్టల్ నడుస్తుందన్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచే కాక. కింద ప్రాంతాల నుంచి వచ్చి ఈ హాస్టల్లో చదువుకునేవారన్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. భవనం పెచ్చులు ఊడి పడిపోతున్నాయన్నారు. అయినా అధికారుల్లో చలనం లేదన్నారు. ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు స్పందించి హాస్టల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న పడాల్

పొంగి ప్రవహిస్తున్న శబరి, గోదావరి

ఎగపోటుకు గురైన సోకే లేరు వాగు

ప్రజాశక్తి-చింతూరు

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి పెరుగుతూ సోమవారం మధ్యాహ్నానికి 37.60 అడుగులకు చేరుకుంది. భద్రాచలం వద్ద 6,61,784 క్యూసెక్కుల నీరు దిగువ విడుదలవుతుంది. శబరి నదిలో వరద నీరు చేరడంతో కూనవరం వద్ద నది నీటిమట్టం గణనీయంగా పెరగడంతో శబరి, గోదావరి నదుల సంగమం వద్ద భయానక వరద వాతావరణం నెలకొంది. వరద నీటితో గోదావరి ఎగువ ప్రాంతమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 90శాతం నిండిపోవడంతో క్రమంగా దిగువకు నీరు విడుదల అవుతుంది. దీంతో గోదావరి నీటిమట్టం మరింత పెరగవచ్చని సిడబ్ల్యుసి అధికారులు వెల్లడించారు. చింతూరు మండలంలోని సోకేలేరు వాగు ఎగపోటు కారణంగా ఇప్పటికే చింతూరు, విఆర్.పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్, ఎఎస్పి పంకజ్ కుమార్ మీనా సోకులేరు వాగు వద్ద ప్రవాహాన్ని పరిశీలించి అక్కడ ఒక బోటును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి బొడ్డుగూడెం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి డైవర్ట్ రహదారి భారీ వర్షానికి వరద నీరు ప్రవహించడంతో వాహనాలు గంటలపాటు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు శబరి నది ప్రవాహం కూడా ఉధృతంగా మారింది. మండలంలోని చంద్రవంక వాగు, సీలేరు నది, కుమ్మూరు వాగు, తడిక వాగులతో సహా అన్ని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మరో రెండు రోజులపాటు వర్షాలు ఇలాగే కొనసాగుతాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో అధికారులు అప్రమత్తతతో ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



పొంగి ప్రవహిస్తున్న చింతూరు మండలంలోని వాగు

ఎడతెరిపిలేని వర్షం-కూలిన భారీ వృక్షం

ఎటపాక : ఎడతెరిపిలేని వర్షంతో మన్యం తడిసి ముద్దయింది. ఏకధాటిగా వర్షం కురుస్తుండటంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. తోటపల్లి, బుట్టాయిగూడెం సమీపంలో కూనవరం వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. విషయం తెలుసుకున్న ఎటపాక సిఐ ఎం కన్నపరాజు, ఎస్సై జి.అప్పలరాజు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన వృక్షాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సిఐ కన్నపరాజు మాట్లాడుతూ భారీ వర్షాలు నేపథ్యంలో ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లో ఎగువ ప్రాంతాల్లో వాగులు పొంగి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. చేపల వేటకు వెళ్లొద్దన్నారు. పోచవరం నుండి పాపికొండలు పర్యాటక ప్రాంతాలు ఉన్నతాధికారుల ఆదేశాలతో తాత్కాలికంగా మూసివేయడం జరిగిందన్నారు.

విఆర్.పురం : వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరి, శబరి నదుల్లోకి భారీగా వరద నీరు చేరి నీటి మట్టాలు పెరుగుతుండడంతో లోతట్టు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం కూనవరం వద్ద 14.63 మీటర్లు, 29.60 అడుగుల శబరి నది నీటి మట్టం చేరింది. వర్షాలకు ఏ క్షణమైనా వరదలు వచ్చే అవకాశం ఉందని ముందు జాగ్రత్త చర్యగా లోతట్టు గ్రామాల ప్రజలు ముందస్తుగా గుట్టలపై పాకలను నిర్మించుకుంటున్నారు. శ్రీరామగిరి, చొక్కానపల్లి, గుండుగూడెం లోతట్టు గ్రామాల ప్రజలు వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, ధర్మతాళ్ల గూడెం, రేకపల్లి, శుద్ధగూడెం, తహశీల్దారు, కార్యాలయం, సచివాలయం చుట్టుపక్కల గుడారాలు ముందుగానే ఏర్పాటు చేసుకుంటున్నారు. మరో వైపు భారీ వర్షాలకు మండలంలోని పలు వాగులు వంకలు, చెరువులు నిండుకొని పొంగి ప్రవహిస్తున్నాయి. అన్నవరం నుండి ఉమ్మడివరం, జల్లివారి గూడెం నుండి ఎజి కోడేరు రోడ్లలో రాకపోకలు నిలిచిపోయాయి. అన్నవరం వద్ద వాగు పొంగి ప్రవహిస్తుండడంతో మండలంలోని 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



బుట్టాయిగూడెం సమీపంలో కూలిన భారీ వృక్షం



పొంగి ప్రవహిస్తున్న విఆర్.పురం మండలం అన్నవరం వాగు

అన్నవరం బ్రిడ్జి వద్ద రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-విఆర్.పురం : భారీ వర్షాలు కారణంగా అన్నవరం వద్ద వాగుపై ఏర్పాటు చేసిన కాజ్వే రెండు చోట్ల బీటలు వారి నాలుగు రోజుల క్రితం క్రుంగిపోవడంతో అన్నవరం అవతల 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అత్యవసర వైద్య సేవలు కూడా ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇది ఇలా ఉండగా వరద ప్రవాహం తగ్గడంతో సోమవారం ఉదయం రాజుపేట, వడ్డిగూడెం గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో కూలీలు వరి నాట్లు వేయడానికి వాగు అవతల ఉమ్మడివరం వైపు గ్రామాలకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వచ్చే సరికి వాగు ప్రవాహం ఉధృతం కావడంతో వీరంతా వాగుకు అవతల వైపు వారంతా ఉండిపోయారు. దీంతో అవతల చెట్టుకు, ఇవతల క్రుంగిన కాజ్వేకు పెద్ద తాడు కట్టి దాని సహాయంతో కూలీలంతా వాగు దాటి వచ్చారు.



కూలిపోయిన అన్నవరం కాజ్వే వద్ద వరద ఉధృతితో నిలిచిపోయిన కూలీలు

వరద ప్రవాహ ప్రాంతాల్లో అధికారుల పర్యటన



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ, ఎసిపి తదితరులు

ప్రజాశక్తి- విఆర్.పురం : గోదావరి, శబరి నదుల్లో వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ అపూర్వభరత్, ఎఎస్పి పంకజ్కుమార్ మీనా చింతూరు డివిజన్లో ఉన్న రోడ్డు బ్లాక్ పాయింట్స్ను సందర్శించారు. మొదట సోకిలేరు బ్లాక్ పాయింట్ సందర్శించి అక్కడ ఒక కంట్రీ బోట్ ఏర్పాటు చేసి, పోలీస్, రెవెన్యూ సిబ్బందికి డ్యూటీ వేశారు. అనంతరం కూనవరం బ్రిడ్జిని సందర్శించి శబరి, గోదావరి నదుల ఒడ్డును పరిశీలించారు. చింతూరు, కూనవరం, విఆర్ పురం మండలాలకు పెద్ద బోట్స్ను కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఎవరు వాగులు దాటడం, చేపలు పట్టడం వంటి కార్యక్రమాలు చేయొద్దని సూచించారు. తరువాత అన్నవరం బ్రిడ్జిను సందర్శించి, వాగు ఉధృతిని పరిశీలించారు. కూలి పనులకు వెళ్లి ఉమ్మడివరం వైపు ఆగిపోయిన ప్రజలకు భోజన సదుపాయం కల్పించాలని తహశీల్దార్ను ఆదేశించారు. అన్నవరం బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన డిజైన్ మంజూరు ఉత్వరులు త్వరలోనే వస్తాయని, సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెల నుంచి శాశ్వత బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సరస్వతి, ఎస్సై సంతోష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిపూడి కల్వర్టును పరిశీలించిన ఐటిడిఎ పిఒ

గంగవరం : గంగవరం మండలం నెల్లిపూడి గ్రామ సమీపంలోని మెయిన్ రోడ్డు కల్వర్టును రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, డిఎస్పి సాయి ప్రశాంత్లు పరిశీలించారు. నెల్లిపూడి కల్వర్టు పై నుండి వరద నీరు పొంగినప్పుడు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీలో అన్ని మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు ఏజెన్సీలోని పర్యటక ప్రాంతాలకు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ముఖ్యమైన ప్రాంతాలలో డ్యూటీలు వేయడం జరిగిందని చెప్పారు. వారి వెంట గంగవరం తహసిల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటేష్ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజవొమ్మంగి మండలం లోదొడ్డి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ సోమవారం ఐటిడిఎలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలంకు లోదొడ్డి సర్పంచ్, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోదొడ్డి గ్రామంలో ఉన్న పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు సుమారు 70 మంది విద్యార్థులు ఉండగా, ఒక్క ప్రధానోపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని, గతంలో ఉన్న సిఆర్టిని బదిలీ చేశారని తెలిపారు. గత మూడు కౌన్సిలింగ్ల్లోనూ లోదొడ్డి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం, విద్యాశాఖ అధికారులను పలుమార్లు అడిగిన వారు ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. దీనికి పీవో స్పందించి త్వరలోనే ఈ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు.



పిఒకు సమస్యను విన్నవిస్తున్న లోతా రామారావు

ప్రతి గ్రామానికీ విద్యుత్ సరఫరా చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల అన్ని గ్రామాలకు క్వాలిటీ విద్యుత్ను అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఏపీఈపీడీసీఎల్ కార్యాలయాన్ని సోమవారం పిఒ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారేడుమిల్లి నుండి వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని కరెంట్ సర్వీసులు ఏ విధంగా ఉన్నాయో సర్వే చేయాలన్నారు. మారుమూల గ్రామాలకు కరెంటు ఏర్పాటుకు ఫారెస్ట్ వారి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొన్ని గ్రామాలలో కరెంటు ద్వారా అడవి జంతువులను వేటాడుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు బిల్లులు సకాలంలో చెల్లించే విధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఒక్కొక్క మండలంలో ఎన్ని కరెంటు కనెక్షన్స్ ఉన్నాయో, ఎంతమంది సిబ్బంది ఉన్నది ఆయన ఆరా తీశారు. ప్రాజెక్టు అధికారి వెంట ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాబ్రియల్, డిఈ మల్లికార్జునరావు, ఏఈలు దొరబాబు, సాలెం బాబు, అబ్బాయి దొర, గోపాలకృష్ణ తదితరులున్నారు.

గంజాయి సాగు నిర్మూలనపై దృష్టి

ఐటిడిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు అధికారి, జెసి అభిషేక్ గౌడ్



మాట్లాడుతున్న ఐటిడిఎ ఇంచార్జి పిఒ అభిషేక్ గౌడ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మారుమూల అటవీ ప్రాంతాలలో గంజాయి సాగు చేయకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మూలనా చర్యలు చేపట్టాలని ఐటిడిఎ ఇంచార్జి పిఒ, జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయంలో అటవీ శాఖ వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, డిఆర్ డిఎ, ఐసిడిఎస్, ఎస్ఎంఐ అధికారులతో గంజాయి నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అటవీ ప్రాంతం, అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేసిన భూముల్లో గంజాయి సాగు చేయకుండా ఎటువంటి పర్యవేక్షణ చేస్తున్నారని అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్టుల వద్ద గంజాయి రవాణాను పకడ్బందీగా తనిఖీ చేయాలని సూచించారు. గ్రామస్థాయి సంఘాల సమావేశాలలో గంజాయి నిర్మూలనపై చర్చ జరగాలని చెప్పారు. గంజాయి సాగును విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలను అందించాలన్నారు. మండల స్థాయి సమావేశాలలో అధికారులు పాల్గొని మండల వ్యవసాయాధికారులు, ఉద్యాన గంజాయి సాగు నివారణ ప్రక్రియపై చర్చించాలన్నారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలని వ్యవసాయాధికారులను సూచించారు. చెక్ డ్యాంల పరిధిలో గంజాయి సాగు చేయకుండా పర్యవేక్షించాలన్నారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్ డి ఏ పిడి వి.మురళి, ఐసిడిఎస్ పిడి ఝాన్సీ లక్ష్మి, ఎస్ఎంఐ డిఇ నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సెమినార్



మాట్లాడుతున్న న్యాయవాది

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేధోసంపత్తి హక్కులు, ఆవిష్కరణలు, సృజనాత్మకత అనే అంశంపై జాతీయ సెమినార్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అధ్యక్షతన ఈ సెమినార్ను రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాది వై.బాల్జి, ఆంధ్ర యూనివర్సిటీ బోటనీ ప్రొఫెసర్ డాక్టర్ సలుగు బోడయ్య పడాల్ హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, ప్రపంచీకరణ యుగంలో ఆవిష్కరణలు, సృజనాత్మకతను కాపాడుకోవడం కోసం మేధోసంపత్తి హక్కులు అత్యంత కీలకం అన్నారు. కాపీరైట్స్, ట్రేడ్‌మార్కులు, జియోగ్రాఫికల్ ఇండికేషన్లు వంటి హక్కులపై అవగాహన పెంపొందించుకోవడంతో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ మినుముల శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు లీలా పావని, రమణ, కేజియా, సంతోషి, గ్రంథాలయ అధికారి తాంగుల జగత్ రాయ్ పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు

రహదారి గుంతల పూడ్చివేత



రోడ్డుపై గోతులు పూడ్చి వేస్తున్న సిపిఎం జెడ్పిటిసి గంగరాజు, మండల నాయకులు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని శిథిలావస్థకు చేరిన రహదారుల గోతులను సిపిఎం నేతలు పూడ్చి వేశారు. ప్రభుత్వం అధికారులు ఎందుకు చర్యలు చేపట్ట లేదని స్థానిక సిపిఎం జెడ్పిటిసి డి.గంగరాజు ప్రశ్నించారు. ఈ సేవల్లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘాట్ రోడ్డు దమ్ముకు పీన్ బెండ్ 6 నెంబర్ మలుపు సమీపాన గుంతల రోడ్డు ను శ్రమదానంతో తాత్కాలికంగా పూడ్చివేశారు. ఈ సందర్భంగా గంగరాజు, పార్టీ మండల కార్యదర్శి కిల్లో, మొస్య మాట్లాడుతూ, అడవి తల్లి బాట కార్యక్రమంలో బాగుగా గిరిజన ప్రాంతంలో రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలు ప్రకటనలకే పరిమితం అయ్యాయన్నారు. ఆచరణలో అమలు కాలేదని విమర్శించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల గడుస్తున్నా ప్రధాన రహదారులే బాగు చేయనప్పుడు మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ రహదారి గుండా అరకు, అనంతగిరి పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు పర్యాటకులు వస్తుంటారన్నారు. మూడు రోజులు వరుసగా సెలవులు కావడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారని, దీంతో గుంతలుగా ఉన్న రోడ్డు వద్ద కిలోమీటర్ దూరం మేర వాహనాలు నిలిచిపోయాయన్నారు. అధికారులు స్పందించక పోవడంతో ఈ విషయం పై జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఫోన్ లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నాయకులు గెమ్మెల.దేవన్న, పాంగి.మద్దు, మండల సహకార సొసైటీ మాజీ చైర్మన్ గుజ్జెల మద్దుసుధన్ని, సురేష్ బాబు పాల్గొన్నారు.

ఎయుతో ఐఐటిఎం ఎంఒయు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎయు,ఐఐటిఎం ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరాలజి (ఐఐటిఎం) సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో ఎయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్. ధనంజయ రావు, ఐఐటిఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్య చంద్రరావు సంతకాలు చేసి ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులను సాధించి, నిర్వహించే దిశగా రెండు సంస్థలు కృషి చేయాలని, పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎంఒయు ప్రగతిని సమీక్షించాలని నిర్ణయించారు. విభిన్న ఉన్నత పదవులలోఉన్న ఎయు పూర్వ విద్యార్థులు వర్సిటీ ప్రగతికి పాటుపడడం సంతోషాన్నిస్తోందన్నారు.

ఐఐటిఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఎయులో ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ మౌసంకార్యక్రమంలో భాగం కావాలని ఎయును ఆహ్వానించారు. దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసి, సెన్సార్ల నుంచి పరికరాల వరకు దేశీయ సాంకేతిక ఉపకరణాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయు వాతావరణ అధ్యయన విభాగం అధిపతి ఆచార్య పి.సునీత మాట్లాడుతూ పరిశోధనలో సంయుక్తంగా కలిసి పనిచేయడం, ఐఐటిఎంకి సంబంధించిన పరిశోధనలకు ఉపయోగించే సమాచారాన్ని పరస్పరం అందించడం, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, సంయుక్తంగా సదస్సులు, వర్క్ షాప్‌ల నిర్వహణ, ఇంటర్న్ షిప్ లు, ఫ్యాకల్టీ కొలాబరేషన్ వంటివి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవిఆర్ రాజు, జి.శశిభూషణరావు, ఐఐటిఎం శాస్త్రవేత్తలు డి పద్మకుమారి, సచిన్ దేశ్ పాండే, శుభ్రత్‌కుమార్ దాస్, విభాగాధిపతులు, ఆచార్యులు, డీన్‌లు పాల్గొన్నారు.

20 వరకు అన్నదాత సుఖీభవ దరఖాస్తు గడువు

ప్రజాశక్తి-ఆనందపురం: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులై ఉండి ఆర్థికసాయం పొందని వారు ఈనెల 20లోగా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి సంధ్య రత్నప్రభ తెలిపారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. అర్హులైన రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భారీ వర్షాలతో అప్రమత్తత

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు : జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: వర్షాల వేళ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. ఏపీ విపత్తుల సంస్థ సూచనల మేరకు పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదన్నారు. సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలని, వర్షాల వేళ అందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.గోదావరి, శబరి ఫ్లడ్స్, హెవీ రైన్స్ కారణంగా ఎటువంటి విపత్తు సంభవించినా వెంటనే ఐటిడిఎ చింతూరు, సబ్ కలెక్టర్ ఆఫీస్ చింతూరులో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్ల ఫోన్ చేసిన వెంటనే తక్షణ సహాయం అందజేయడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.ఐటిడిఎ చింతూరు, హెల్ప్ లైన్ సెల్ నంబర్లు 8121729228 / 9490026397, లేండ్ లైన్ నెంబర్ 08864 299936, సబ్ కలెక్టర్ ఆఫీస్ చింతూరు, హెల్ప్‌లైన్ సెల్ నంబర్లు 8121729228/ 9490026397, లేండ్ లైన్ నెంబర్ 08864299936కు ఫోన్ చేయాలన్నారు.

వాగులో గిరిజనుడి గల్లంతు



వాగు వద్ద గాలిస్తున్న గిరిజనులు

హుకుంపేట : మండలంలోని అడ్డుమండ పంచాయతీ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం వరద ప్రవాహం ఉద్ధతంగా ఉండగా, వంతెన దాటుతుండగా గ్రామానికి చెందిన కంబిడి కుమారస్వామి (41) వాగులో కొట్టుకుపోయాడు. ప్రత్యక్ష సాక్షి బొంజుబాబు తెలిపిన వివరాల ప్రకారం కుమారస్వామి మోదపుట్టు గ్రామానికి వెళ్లి సరుకులు కొనుగోలు చేసుకుని అడ్డుమండకు తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. వర్షాల కారణంగా వాగు ప్రవాహం తీవ్రంగా పెరిగింది. కుమారస్వామితో పాటు తాను కూడా దాటేందుకు ప్రయత్నించానని, నీటి ఉధృతిని చూసి వెనక్కి తగ్గానని బొంజుబాబు వెల్లడించారు. కుమారస్వామి కాలు జారి నీటిలో కొట్టుకుపోయాడని తెలిపారు.గ్రామస్తులు వెంటనే సహాయం చేయడానికి ప్రయత్నించినా, చీకటి కారణంగా గాలింపు చర్యలు కొనసాగించలేకపోయారు. సోమవారం స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్తులు కలిసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా అడ్డుమండ సర్పంచ్ గుమ్మ శ్యాంసుందర్ మాట్లాడుతూ, వంతెన సమస్యపై పలుమార్లు అధికారులను సంప్రదించినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే పెద్ద వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి -తగరపువలస : ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. సోమవారం స్థానిక సంగివలస ఎన్నారై వైద్య కళాశాలలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవాల ముగింపు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని, ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్ట రీత్యా తీసుకునే చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు వివరించారు. కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్నారై వైద్య కళాశాల సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, పరిపాలనాధికారి శివ ప్రసాద్, నార్త్ పోలీస్ సబ్ డివిజన్ ఎసిపి, అప్పలరాజు, సిఐ, బి తిరుమల రావు, వివిధ విభాగాల అధిపతులు, సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు పోలీస్ కమిషనర్ బహుమతులు అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్‌ను సంస్థ డీన్, సిఇఒ ఘనంగా సత్కరించారు.

వర్షాలతో అప్రమత్తం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మారేడుమిల్లి మండలం, వై.రామవరం ఎగువ ప్రాంతాల్లో వాగులు పొంగి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మారేడుమిల్లి సిఐ టిజిఎన్ ప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎవరు వాగులు దాటటం, చేపలు పట్టడం చేయరాదని, కొండవాగులు ప్రవాహం ఉధృతిగా ఉందడంతో వాగుల వైపు వెళ్ళరాదని హెచ్చరించారు. మారేడుమిల్లి పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందన్నారు. అలాగే మారేడుమిల్లి నుండి భద్రాచలం ఘాట్ రోడ్డులో అత్యవసరమైతే తప్పా ప్రయాణాలు చేయరాదని హితవుపలికారు. అవసరమైతే సిఐ ఫోన్ నెంబర్ 9440900751, ఎస్సై ఫోన్ నెంబర్ 9440904866లకు సంప్రదించాలని సూచించారు.

చింతూరు : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చింతూరు మండలం, మోతుగూడెం, డొంకరాయి ఎగువ ప్రాంతాల్లో వాగులు పొంగి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని చింతూరు సిఐ సిహెచ్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాగులు దాటొద్దని, కొండ వాగుల వైపు వెళ్ల వద్దని సూచించారు. మోతుగూడెం పర్యాటక ప్రాంతాలు తాత్కాలికంగా మూసివేసినట్లు చెప్పారు. ఏదైనా అవసరమైతే సిఐ నెంబర్ 9281442982, ఎస్ఐ నెంబర్ 9182609596లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

సీలేరు : భారీ వర్షాల నేపథ్యంలో జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి పంచాయతీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీలేరు ఎస్సై కే రవీంద్ర అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, పొంగిపొర్లుతున్నాయని, వాగులు దాటేందుకు ఎవరు సాహసం చేయవద్దని సూచించారు.

నవంబర్ 30న వైజాగ్ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 30న సంధ్యా మెరైన్ వైజాగ్ మారథాన్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ మారథాన్ 4వ ఎడిషన్ రిజిస్ట్రేషన్లను విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి సోమవారం ప్రారంభించారు. స్థానిక నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఉత్తమ ఆహార అలవాట్ల ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. బీచ్ రోడ్డులో జాగింగ్ ట్రాక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ ఈ పోటీల్లో అన్ని వయస్సుల వారూ పాల్గొనే విధంగా 32కె, 21కె, 10కె, 5కె విభాగాల్లో మారథాన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు http://www.vizagmarathon.runలో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మారథాన్‌లో పాల్గొనేవారికి ఫ్యూమ రేస్ టీ షర్ట్, మెడల్, రేస్ ఫోటోగ్రాఫ్స్, ఎనర్జీ డ్రింక్, అల్పాహారంతో పాటు విజేతలకు రూ.10 లక్షల విలువగల బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రేస్ పోస్టర్‌ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ డైరెక్టర్ ఆనంద్, మెడికల్ పార్ట్‌నర్ అపోలో హాస్పిటల్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కృష్ణ ప్రసాద్, వరుణ్ గ్రూప్ అధినేత ప్రభు కిషోర్, నోవాటెల్ ప్రతినిధి శ్రీలక్ష్మి శ్రీధర్, వైజాగ్ రన్నర్స్ సొసైటీ సెక్రటరీ కె.శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ రాధిక పాల్గొన్నారు.

రూ.38 కోట్లతో జిల్లా గ్రంథాలయ భవనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలంలో పారామెట్రిక్ డిజైన్‌తో రూ.37.95 కోట్లతో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయ భవనం నిర్మాణానికి ఆమోదం కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపాలని సోమవారం జరిగిన జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ మేరకు ఇచ్చిన ఎస్టిమేషన్లపై సమావేశంలో ముందుగా చర్చించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో వివిధ శాఖా గ్రంథాలయాలకు రూ.6 లక్షలతో ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు నిమిత్తం పరిపాలనా ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపేందుకు చేసిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. పరవాడ మండలం వాడచీపురుపల్లిలో శాఖా గ్రంథాలయానికి నూతన భవనం నిర్మాణం కోసం రూ.25.లక్షలతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులు ఇచ్చిన ఎస్టిమేషన్స్‌పై చర్చించి తీర్మానం చేసి ఆమోదించారు. విద్యాశాఖ ఎడి.గోపి కృష్ణ, వయోజన విద్య ఉపసంచాలకులు ఎస్.సుబ్రహ్మణ్యవర్మ, జిల్లా పంచాయతీ శాఖ ఎఒ బివికె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ధారకొండ కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి

అంతవరకూ ప్రభుత్వ కార్యక్రమాలు బహిష్కరణ : మండల సాధన కమిటీ



మండల సాధన కమిటీ నేతలు

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలంలోని సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మిరేవులు, ఏ దారకొండ, గాలికొండ తదితర ఆరు పంచాయతీల పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే దారకొండ కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని మండల సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం సీలేరు రైతు సేవా కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో సాధన కమిటీ నాయకులు పలు అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. మండల కేంద్రం ఏర్పాటయ్యేవరకు ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరించాలని మండల సాధన కమిటీ నాయకులు నిర్ణయించారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను రాజకీయ పార్టీలకు అతీతంగా బహిష్కరించాలని నిర్ణయించారు. స్థానిక సర్పంచి పాంగి దుర్జో, నాయకులు సుంకర విష్ణుమూర్తి, మార్కు రాజు, కారే శ్రీనివాస్, చీటికెల రాము, సదరం మారిబాబు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఐక్యమత్యంతో మండల కేంద్రం ఏర్పాటుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ఆరు పంచాయతీలు ఎన్నో సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోక వెనుకబడి ఉన్నాయన్నారు. దారకొండ మండల కేంద్రం ఏర్పాటైతే విద్య, వైద్యంతో పాటు అన్ని అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఎమ్మెల్యే, ఎంపీ, టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. మండల కేంద్రం ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. అలాగే ఆర్వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు అంతర్రాష్ట్ర రహదారిపై అన్ని రాజకీయ పార్టీలు ఏకమై ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ ఇప్పటి వరకు నిర్మాణానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు రహదారి అస్తవ్యస్తంగా ఉందని, మరికొన్ని రోజులు ఇదే తరహాలో భారీ వర్షాలు కురిస్తే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో గర్భిణీ స్త్రీలు మైదాన ప్రాంతంలో వైద్య సేవలు పొందడానికి రహదారి సౌకర్యం లేక ప్రాణాలు పోతున్నాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు మనోజ్ కుమార్, గోవిందు, బాలు, సొన్ను, స్వాభా జగన్ మన్మధరావు, ధర్మ వరప్రసాద్, అప్పలరాజు, బుజ్జి, ముంది తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ పథకాలతో గిరిజనాభివృద్ధి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆదికర్మయోగి, వికసిత్ భారత్ పథకాల ద్వారా గిరిజనాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆది కర్మయోగి, వికసిత్ భారత్ పథకాలు ద్వారా గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయుటకు 17 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మండల అధికారులకు జిల్లా మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు ఐటీడీఏ సమావేశపు హాల్లో 42 మందికి ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలోని గ్రామాలలో రోడ్లు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, జీవనోపాధి, చిన్న తరహా పరిశ్రమలు, అడవి ఉత్పత్తులు తదితరాలు ఆదికర్మయోగి, వికసిత్ భారత్ పథకాలు ద్వారా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాలుగు జిల్లాల్లోని ముందుగా ప్రభుత్వం 522 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.

విశాఖ వన్ టౌన్‌లో కాల్పుల కలకలం

ఒకరికి తీవ్ర గాయాలు - ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ వన్ టౌన్‌లో కాల్పుల కలకలం రేగింది. 39వ వార్డు చిలకపేటలో ఆదివారం అర్ధరాత్రి చేపల రాజేష్‌పై అదే ప్రాంతానికి చెందిన దూర నూకరాజు తన వద్ద ఉన్న తుపాకీతో పొట్టపై కాల్చాడు. ఆ సమయంలో నూకరాజు స్నేహితుడు దిలీప్, మరో ఇద్దరు అక్కడ ఉన్నారు. ఈ కేసులో సోమవారం సాయంత్రానికి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజేష్‌ను చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ సంఘటన జరగడానికి ముందు చిలకపేట ఆర్చి దగ్గర రాజేష్, నూకరాజు మద్యం సేవించి గొడవపడ్డారు. ఆ సమయంలో నూకరాజు కత్తితో రాజేష్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించాడు.

ఆ క్రమంలో రాజేష్ కత్తి లాక్కున్నాడు. తర్వాత ఇద్దరూ అక్కడి నుంచి వెళ్ళిపోయారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో మళ్లీ అదే ప్రాంతానికి వచ్చి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈసారి నూకరాజుతో పాటు అతని స్నేహితుడు దిలీప్, రాజేష్‌తో పాటు అతని స్నేహితుడు వాసుపల్లి నరేష్ ఉన్నారు. గొడవ తీవ్రం కావడంతో నూకరాజు తన వద్ద ఉన్న తుపాకీతో రాజేష్‌పై కాల్పులు జరిపాడు. అనంతరం నూకరాజు, దిలీప్ అక్కడ నుంచి పారిపోయారు. గాయపడ్డ రాజేష్‌ను కెజిహెచ్‌కు నరేష్ తదితరులు తీసుకువెళ్లారు. ఈ సంఘటన వెనుక రిటైర్డ్ కానిస్టేబుల్ నాయుడు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. నాయుడు అప్పట్లో కానిస్టేబుల్‌గా ఉండి విధులకు సక్రమంగా హాజరుకాకుండా పోర్టులో లారీలు పెట్టి బొగ్గు వ్యాపారం చేసేవాడు. డబ్బులు బాగా గడించాడు. పోలీసు ఉద్యోగం కంటే అదే బాగుందని భావించి ఆ వ్యాపారంలో కొంతమందిని చేర్చుకున్నాడు. వారంతా ఒక ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది. అయితే ఈ ముఠా కొన్ని ఆగడాలకు, అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి రాజేష్ ప్రశ్నించేవాడని పలువురు చెబుతున్నారు. ఈ క్రమంలోనే గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నూకరాజు, దిలీప్‌లను పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. సంఘటనలో వెనకుండి నడిపించిన ప్రధాన నిందితుడు, రిటైర్డ్ కానిస్టేబుల్ నాయుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

హెలీ మ్యూజియం ప్రారంభం



హెలీ మ్యూజియం ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు వీరాంజనేయస్వామి, అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, నగరంలో ఆకర్షణీయమైన ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత అన్నారు. బీచ్ రోడ్డులో ఇండియన్ నేవీ సహకారంతో సుమారు రూ.3.50 కోట్ల నిధులతో నెలకొల్పిన యుహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని సోమవారం సాయంత్రం వారు ప్రారంభించారు. అనంతరం డోలా వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ అతి త్వరలోనే దేశంలోని అతి పెద్ద గ్లాస్ బ్రిడ్జిను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, విఎంఆర్‌డిఎ కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, కార్యనిర్వహక ఇంజినీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

కైలాసగిరిపై త్రిశూలం, డమరుకం నిర్మాణానికి భూమి పూజ

కైలాసగిరిపై రూ.కోటీ 55 లక్షల వ్యయంతో 55 అడుగుల ఎత్తులో నిర్మించనున్న త్రిశూలం, డమరుకం నిర్మాణాలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి అనిత భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి



పిఒకు వినతిపత్రం ఇస్తున్న లోతా రామరావు, తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం : వేములకొండ పంచాయతీలోని ఆనంపల్లి, సోకులు గూడెం, దబ్బవలస, ధారగూడెం గ్రామాలకు కలిపి ఒక పంచాయతీని ఏర్పాటు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఐటిడిఏ ఏవోకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఆనంపల్లి, సోకులు గూడెం, దబ్బవలస, ధారగూడెం గ్రామాలు ప్రజలు పంచాయతీ కార్యాలయానికి, సచివాలయానికి వెళ్లాలంటే సుమారు 40 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని చెప్పారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల్లో సుమారు 2500 మంది జనాభా ఉన్నారని, కావున వారికి ఈ నాలుగు గ్రామాలకు కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నర్రి పాపారావు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు కడబాల ప్రేమలత, కార్యదర్శి సూంట్రూ రాజామణి, వార్డ్ సభ్యులు కడబాల రామారావు, కడబాల బాబురావు, తీగల చిన్నయ్య పాల్గొన్నారు.